లక్ష్మి ఆధునికీకరణ పూర్తయ్యేనా ?

- ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న పనులు
- ఇంకా మిగిలి ఉన్న రూ.1.8 కోట్ల విలువైన పనులు



లైనింగ్ చేపట్టాల్సిన లక్ష్మి డీ-4 కాలువ

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్(ఎస్సారెస్పీ) నుంచి నీటిని సరఫరా చేసే లక్ష్మి కాలువ ఆధునీకీకరణ పనులు ఈసారైనా పూర్తయ్యేనా అని ఆయకట్టు రైతులు ఎదురు చూస్తున్నారు. కాలువ ఆధునికీకరణ పనుల కోసం 2017లో రూ.17 కోట్లు మంజూరయ్యాయి. అదే ఏడాది నుంచి కాలువ పనులు చేపడుతున్నారు. సీజనల్‌గా చేపట్టే పనులు కావడం వల్ల ఆగుతూ.. సాగుతూ జరుగుతున్నాయి. ప్రస్తుతం లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల నిలిపేశారు. పక్షం రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు పనుల ఊసే లేదు. నీటి విడుదల నిలిపి వేసే సమయంలో చేపట్టే పనులు కావడంతో వెంటనే పనులు ప్రారంభిస్తే సకాలంలో పూర్తయ్యే అవకాశం ఉండేది. మళ్లీ ఖరీఫ్ సీజన్‌లో నీటి విడుదల ప్రారంభించగానే పనులు నిలిపేస్తారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తూముల మరమ్మతులు..

ప్రస్తుతం రూ.1.8 కోట్ల నిధుల పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ నిధులతో వెంటనే పనులు ప్రారంభించాలి. నల్లూర్ శివారులో ప్రధాన కాలువ వద్ద సైఫన్ నిర్మాణం మధ్యలోనే నిలిచి పోయింది. డీ-4 కాలువపై ఉన్న పలు తూముల మరమ్మతులు చేపట్టాలి. అంతే కాకుండా డీ-4 కాలువ లైనింగ్ పనులు చేపట్టాలి. డీ-4 కాలువ నీటి ఆధారంగానే చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకానికి నీరు అందుతుంది. నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో పనులు సకాలంలో పూర్తి కావడం లేదు.

ఈ సీజన్‌లో పూర్తి చేస్తాం

లక్ష్మి కాలువ ఆధునికీకరణ పనులు ప్రస్తుత సీజన్‌లో పూర్తి చేస్తాం. కాలువ ఆధునికీకరణ పనుల్లో రూ.1.8 కోట్ల పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఖరీఫ్‌లో కాలువల ద్వారా నీటి విడుదల నాటికి పూర్తి చేసి సిద్ధంగా ఉంచుతాం. అందుకు ప్రణాళికల రచిస్తున్నాం.

– సురేశ్, డిప్యూటీ ఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ



ముప్కాల్ మండల కేంద్ర శివారులో లక్ష్మి కాలువలో నీటి కోసం మహిళ రైతు పడుతున్న కష్టం

రైతుల 'పానీ' పాట్లు !

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి సరాఫరా చేసే లక్ష్మి కాలువ లీకేజీ నీటి కోసం రైతులు అనేక తిప్పలు పడుతున్నారు. కాలువ ఆయకట్టు చివరి తడికి నీటి అవసరం ఉండటంతో కాలువలో లీకేజీ నీటికి రైతులు అడుగడుగునా అడ్డుకట్ట వేసుకున్నారు. దీంతో చివరి వరకు లీకేజీ నీరు కూడ వెళ్లడం లేదు. ముప్కాల్ మండల కేంద్ర శివారులో పంపు సెట్ కోసం కావాల్సిన నీటి కోసం మహిళా రైతు పడుతున్న పాట్లు 'సాక్షి' కంట పడింది.

బండరాళ్లను పగులగొట్టి.. భూమిలో పాతిపెట్టి

బాల్కొండ: వ్యవసాయ సాగు భూమిని ప్రస్తుతం కొనుగోలు చేయాలంటే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఎకరానికి రూ.40 లక్షలు పలుకుతుంది. దీంతో కొందరు రైతులు భూమిని అభివృద్ధి చేయటానికే ఆసక్తి చూపుతున్నారు. తమ పంట భూమిలో ఉన్న పెద్ద పెద్ద బండరాళ్లను తొలిగిస్తూ భూమిని అభివృద్ధి చేసుకుంటున్నారు. ప్రొక్లెయిన్‌తో తవ్వకాలు చేపట్టి, బండరాళ్లను పగుల గొట్టి అదే భూమిలో పాతి పెడుతున్నారు. తరువాత ఆ నేలలో సాగు చేస్తున్నారు. ఇలా ఎకరానికి రూ.2 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. మెండోరా మండల కేంద్రం శివారులో ఓ రైతు తన భూమిలో బండరాళ్లను పగులగొడుతూ వ్యవసాయానికి అనుకూలంగా మార్చుకుంటున్న దృశ్యాన్ని సాక్షి క్లిక్‌మనిపించింది.



క్లుప్తంగా

సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విశ్వనాథ్



బోధన్: బోధన్‌కు చెందిన విశ్రాంత తహసీల్దార్ పి.విశ్వనాథ్ ఇటీవల సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్(సమాఖ్య) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణ కేంద్రంలోని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో విశ్వనాథ్‌ను సీనియర్ సిటిజన్స్ ఫోరం బోధన్ శాఖ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ విఠల్, ఫోరం అధ్యక్షుడు మురహరి, ప్రతినిధి విఠల్‌రావు, కాకయ్య, కే.సాయిలు, ఎం. రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నవీపేట: ఈ నెల 30న జరిగే మహనీయుల జయంతిని విజయవంతం చేయాలని బోధన్ డివిజన్ ఎస్సీ ఎస్టీ పరిరక్షణ కమిటీ కన్వీనర్ నీరడి ఈశ్వర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్లను బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి యేడాది ఏప్రిల్‌లో మహనీయుల జయంతిని నిర్వహిస్తామని పేర్కొన్నారు. కమిటీ ప్రతినిధులు వెంకట్, నీరడి రవి, సురేందర్, కామయ్య పాల్గొన్నారు.

బోధన్‌లో..

ఎడపల్లి(బోధన్): బోధన్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఈ నెల 30న మహనీయుల జయంతి ఉత్సవాలను నిర్వహిస్తామని ఎస్సీ ఎస్టీ పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు. మండల కేంద్రం శివారు ప్రాంతంలో గల సాటాపూర్ గేట్ చౌరస్తా వద్ద మహనీయుల జయంతి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం నేతలు నీరడి ఈశ్వర్, వాగ్మారే సూర్యకాంత్, మాధస్తు శ్రవణ్ కుమార్‌లు మాట్లాడుతూ.. పట్టణంలోని నర్సి రోడ్డులో గల రాఘవులు రైస్ మిల్ నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ తీయనున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు కొంద్ర వెంకట్, కో కన్వీనర్ రవి, ప్రతినిధులు పాల్గొన్నారు

మొక్కలకు నిప్పంటిస్తే జరిమానా



సాక్షి ఎఫెక్ట్..

డొంకేశ్వర్(ఆర్మూర్): పంట పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టి హరితహారం మొక్కలకు హాని కలిగిస్తే జరిమానా విధిస్తామని ఎంపీడీవో బ్రహ్మానందం హెచ్చరించారు. 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన 'పొలానికి నిప్పు.. మొక్కలకు ముప్పు' కథనానికి ఆయన స్పందించారు. పంచాయతీ కార్యదర్శి శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్‌తో కలిసి మొ క్కలు కాలిపోయిన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కారణమైన వారికి జరిమానా వేయా లని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గురువారం ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీటిని అందించాలని సూచించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి వద్ద గల అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు సమీపంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. సరిహద్దున గల మహారాష్ట్ర నుంచి ధాన్యం రాకుండా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు 24 గంటల పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. చెక్‌పోస్టు వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై మూల మలుపు ప్రమాదకరంగా ఉండటంతో రేడియం డ్రమ్‌లను అమర్చారు. అలాగే సూచిక బోర్డును ఏర్పాటు చేసినట్లు వివరించారు.

నేడు భూభారతిపై అవగాహన

వేల్పూర్: భూభారతి చట్టం అమలుపై వేల్పూర్ మండల కేంద్రంలోని గురడికాపు సంఘంలో గురువారం ఉదయం 11.30 గంటలకు అవగాహన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ సంతోష్ బుధవారం తెలిపారు. రైతులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

కబడ్డీ అసోసియేషన్ సమావేశం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని భూదేవి ఇండోర్ స్టేడియంలో గురువారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ సమావేశం నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుధవారం తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణ, గత సంవత్సరంలో చేపట్టిన క్యాంపులు తదితర అంశాలపై చర్చ ఉంటుందన్నారు.

మెరుగైన విద్యను అందిస్తున్నాం

మోర్తాడ్: తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నామని పాలెం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం ప్రమీలారాణి తెలిపారు. బుధవారం పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆమె సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సంఖ్య పెరగడానికి అందరు కృషి చేయాలని సూచించారు. ఇంటింటికి తిరిగి అడ్మిషన్లు చేయించారు.

రెంజల్(బోధన్): దూపల్లిలో గల ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు బుధవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలను వివరించారు. హెచ్ఎం వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు కృష్ణ, ప్రభాకర్, సాయన్న, రాజేశ్వర్, రాములు, రాధ, లక్ష్మి, సంధ్య, సురేష్, పీఆర్‌టీయూ నేత సోమలింగంగౌడ్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో సమావేశం

వేల్పూర్: విద్యా సంవత్సరం ముగింపు రోజు బుధవారం వేల్పూర్ మండల ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఈ ఏడాది ఎలా చదువుకున్నది వివరించారు. విద్యార్థుల ప్రగతి పత్రాలను తల్లిదండ్రులకు అందజేశారు.



పాలెంలో ఇంటింటికి తిరుగుతూ విద్యార్థుల అడ్మిషన్లు చేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

వేసవి సెలవుల్లో అప్రమత్తంగా ఉండాలి

రుద్రూర్: ఎండలు తీవ్రంగా ఉన్నందున వేసవి సెలవుల్లో పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎంఈవో కట్ట శ్రీనివాస్ సూచించారు. విద్యా సంవత్సరం చివరి రోజు సందర్భంగా రుద్రూర్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేశారు. ఉపాధ్యాయులు కర్నె శంకర్, వెంకట రమణ, మోహన్, సీఆర్పీ అంబర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలి



ఆర్మూర్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా మహిళలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారులతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రసవాల సమయంలో సర్జరీల కంటే సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. డాక్టర్లు, సిబ్బంది సమయ పాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి కుమార్, డాక్టర్లు సుప్రియ, అపర్ణ, స్రవంతి, గీత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలో అసీల్ కోడిపుంజు



డొంకేశ్వర్(ఆర్మూర్): ఫోటోలో కనిపిస్తున్న కోడిపుంజు పేరు అసీల్. ఇది ఏపీతో పాటు భారత దేశంలో దక్షిణాదిలో ఎక్కువగా కనిపిస్తుంది. దీని బరువు మూడు నుంచి ఆరు కేజీల వరకు ఉంటుంది. అదే పెట్ట అయితే రెండు కేజీల వరకు ఉంటుంది. ఏడాదిలో 60–80 వరకు గుడ్లు పెడతాయి. దీని ఫించాలు ముదురు గోధుమ, ఎరుపు, నలుపు బంగారపు రంగులో ఉంటాయి. ఐతే, దీనిని ఓ రైతు నిజామాబాద్‌లో జరిగిన రైతు మహోత్సవంలో ప్రదర్శనకు ఉంచారు. అందరూ దీనిని ఆసక్తిగా తిలకించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలే కాని ప్రతీది రాజకీయం చేయడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి హితవు పలికారు. పెర్కిట్‌లో బుధవారం వినయ్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి కేంద్ర మంత్రులను ఒప్పించి ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తేవాలన్నారు. తాను మంత్రుల సహకారంతో నియోజకవర్గానికి రూ.50 కోట్ల 82 లక్షల నిధులు తీసుకువచ్చానన్నారు. ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, నాయకులు పండిత్ పవన్, షేక్ మున్ను, వేణు గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత వినయ్ రెడ్డి

మామిడిపల్లిలో చలివేంద్రం ప్రారంభం

ఆర్మూర్‌టౌన్/పెర్కిట్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా సమీపంలో ఉన్న ఖాందేష్ కాంప్లెక్స్ వద్ద రక్షా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వినయ్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

కొనుగోళ్లలో జాప్యంపై రైతుల ఆందోళన

రుద్రూర్: పోతంగల్ చెక్ పోస్ట్ వద్ద బుధవారం రైతులు ఆందోళన చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాటా చేసిన ధాన్యాన్ని రైస్ మిల్‌కు పంపడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కాటా చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్‌కు తరలించాలని రోడ్డుపై బైఠాయించారు. నిజామాబాద్‌కు కాకుండా స్థానికంగా ఉన్న రైస్‌మిల్లులకు అలాట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమయంలోనే ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి రావ డంతో రైతులు తమ సమస్యను విన్నవించారు. ఎమ్మెల్యే హామీతో రైతులు ఆందోళన విరమించారు.



పోతంగల్ చెక్‌పోస్ట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

సంస్కార సాధన తరగతులు

మోర్తాడ్: భీమ్‌గల్ పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సంస్కార సాధన తరగతులను నిర్వహించడానికి పాఠశాల యాజమాన్యం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తోంది. విద్యార్థి దశలో ఉన్నప్పుడే సామాజిక పురోగతిని వారిలో కల్పిస్తే వారి భవిష్యత్తుకు మంచి బాటలు వేయవచ్చనే ఉద్దేశంతో ఈ నెల 28 నుంచి మే 12 వరకు తరగతలను నిర్వహించనున్నారు. ఈ శిక్షణలో 9 నుంచి 14 ఏళ్ల బాలబాలికలు పాల్గొనవచ్చు. ప్రతి ఒక్కరు రూ.500ల చొప్పున ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయి. ఈ శిక్షణలో సూర్య నమస్కారాలు, యోగ, పౌరాణిక కథలు, నీతి కథలు, మహనీయుల జీవిత చరిత్ర, భగవద్గీత శ్లోకాలు, బాలికలకు క్లాసికల్ డ్యాన్స్, బాలురకు సంగీతం, వేద గణితం బోధించనున్నారు. తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వెరిఫికేషన్ చేయాలి

ఆర్మూర్‌టౌన్: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వెరిఫికేషన్ చేయాలని మున్సిపల్ కమిషన్ రాజు అన్నారు. ఆర్మూర్ పట్టణంలో ఈ పథకం కింద 12, 13, 30, 34వ వార్డులలో దరఖాస్తు చేసిన అభ్యర్థుల వివరాలను అధికారులు పరిశీలించారు. మొత్తం 2,670 మంది ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అర్హులైన వారి జాబితాను సంబంధిత బ్యాంకులకు పంపిస్తూ, నాన్–బ్యాంకింగ్ రంగాలకు చెందిన వారి వివరాలను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ శేఖర్, ఆయా వార్డుల ఆఫీసర్లు పాల్గొన్నారు.

జిరాక్సులను అందించాలి

రెంజల్(బోధన్): రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జిరాక్స్ ప్రతులను పంచాయతీ కార్యదర్శులకు అందించాలని రెంజల్, నీలా కార్యదర్శులు రాజేందర్‌రావ్, సాయిలు సూచించారు. దరఖాస్తు ఫారాలను మూడు సెట్లు జిరాక్స్ తీయించి ప్రతీ సెట్‌కు ఆన్‌లైన్ అప్లికేషన్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం, బ్యాంకుల ఖాతా పుస్తకంతో పాటు పీపీ సైజు ఫోటోలను జత చేసి పంచాయతీ కార్యాలయాల్లో అందించాలని సూచించారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన



బోధన్‌టౌన్(బోధన్): నిజాయితీ గల అధికారి బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణపై అసత్య వార్తలు రావడాన్ని ఖండిస్తూ బుధవారం బల్దియా అధికారులు, సిబ్బంది కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నిందలు వేయడం సరికాదన్నారు. ప్రజలకు– ప్రభుత్వానికి వారధిగా ఉండి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన వారే తప్పుడు వార్తలు రాయడం సరికాదన్నారు. నిరసనలో మేనేజర్, డీఈ, ఏఈ సిబ్బంది పాల్గొన్నారు.

పోషక పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్‌బీ, ఐసీడీఎస్ సీడీపీవో భార్గవి తదితరులు

ఆర్మూర్‌టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషక పదార్థాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్‌బీ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మెడికల్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన పోషణ పక్షం, అంగన్‌వాడీ ప్రి ప్రైమరీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటింటా పోషణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాశన నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాజు, ఐసీడీఎస్ సీడీపీవో భార్గవి, సూపర్‌వైజర్ నళిని పాల్గొన్నారు.

గాయపడ్డ నెమలి అప్పగింత

వేల్పూర్: వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామ చెరువు పరిసరాల్లో గాయపడ్డ నెమలిని స్థానిక గంగపుత్రులు బుధవారం సాయంత్రం గుర్తించారు. ఈ విషయాన్ని మాజీ సర్పంచ్ సొడ రమేశ్‌కు తెలుపగా ఆయన అటవీశాఖ అధికారి ఉత్తమ్‌కు సమాచారం అందించారు. దీంతో అధికారులు జాన్కంపేట్‌కు చేరుకొని గాయపడ్డ నెమలిని చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు.

ఉగ్రదాడిలో అమరులకు శ్రద్ధాంజలి



నందిపేటలో శ్రద్ధాంజలి ఘటిస్తున్న కాంగ్రెస్ నేత వినయ్ రెడ్డి, ఇతర నేతలు



ఎడపల్లిలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిలో అసువులు బాసిన పర్యాటకులకు బుధవారం జిల్లాలో పలు చోట్ల శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీలకతీతంగా కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించి మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఉగ్రవాదులను దిష్టిబొమ్మలను దహనం చేశారు. పర్యాటకుల మృతికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్ కుమార్‌రెడ్డి అన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఏర్గట్లలో ..



రుద్రూర్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	మ్యాడ్‌స్క్వేర్(తెలుగు)-11.10, 7.45, మధురం-1.55 జాక్(తెలుగు) 4.50, డియర్ ఉమ-10.30
స్క్రీన్-2	ఓదెల-2-10.00, 1.05, 4.10, 7.15, 10.20
స్క్రీన్-3	జాక్(తెలుగు)-11.15, 8.40 మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-2.10, 5.10
స్క్రీన్-4	అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి-10.30, 1.30, 4.30, 7.30,10.30



మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,700	వెండి(కిలో)	1,02,000
22 క్యారెట్స్	91,112		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు



వడ్డేపల్లిలో గల ఆత్మలింగేశ్వర శివాలయంలో ..

బోధన్‌టౌన్/పెర్కిట్(ఆర్మూర్)/ఎడపల్లి: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ రమా సత్యనారాయణ స్వామి ఆలయం 10వ వార్షికోత్సవం, బోధన్ పట్టణంలోని రాకాసీపేట్‌లో గల అయ్యప్ప స్వామి ఆలయ 29వ వార్షికోత్సవం, ఎడపల్లి మండలం వడ్డేపల్లిలో గల ఆత్మలింగేశ్వర శివాలయ 13వ వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌కు చెందిన రాజమణికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.32 వేలు మంజూరు కావడంతో సంబందించిన చెక్కును బుధవారం కాంగ్రెస్ నాయకులు, ఆమెకు అందజేశారు. నాయకులు రమేష్, చందు, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట్(ఆర్మూర్): కుద్వాన్‌పూర్‌కు గుండు ముత్తెమ్మకు మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును స్థానిక నాయకులు అందజేశారు. గుండు ముత్తెమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిపాలు కాగా ఖర్చుల నిమిత్తం రూ.19 వేలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, యువజన కాంగ్రెస్ నాయకులు బైండ్ల ప్రశాంత్, ఎడ్డిగారి నిఖిల్, తబ్రేజ్, తదితరులు కలిసి బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు.

సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లిలో మాల సంఘ భవన నిర్మాణానికి ఎంపీ నిధులు రూ.3.5 లక్షలు మంజూరు కావడంతో బుధవారం భవన నిర్మాణానికి బీజేపీ నాయకులు భూమి పూజ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు చిలుక దినేష్, నాయకులు వెంకట నర్సయ్య, నరేశ్, మ్యాక నర్సయ్య, కిషన్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో యూనిఫాంలు అందించాలి

బాల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరంలో ఉచితంగా అందించే యూనిఫాంలను సకాలంలో అందించాలని ముప్కాల్ ఎంఈవో జక్కుల రవి అన్నారు. బుధవారం ముప్కాల్ మండల కేంద్రంలో సెర్ప్ ఆధ్వర్యంలో విద్యార్థుల నుంచి కొలతలు తీసుకున్నారు. ఏపీఎం ప్రసాద్‌రావు, సీసీలు పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో ఆంగ్ల భాషా దినోత్సవం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో బుధవారం షేక్స్పియర్ జయంతి సందర్భంగా ఆంగ్ల భాష దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రిక మాట్లాడుతూ..ఆంగ్ల భాష వల్ల విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. భాషపై మంచి పట్టు సాధించాలన్నారు. అధ్యాపకులు జ్యోతి, సాయి రక్షిత, ఎన్. సుహాసిని, ప్రనూష, విద్యార్థులు పాల్గొన్నారు.